సాక్షి ప్రకాశం

శనివారం । 18 । అక్టోబర్ । 2025



పశువులంటే ప్రాణం..బీమా ఇవ్వం

పశుబీమా పథకానికి కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంపై పశుపోషకులు మండిపడుతున్నారు.

- 10లో..



కూటమి కుతంత్రాలను అడ్డుకుందాం

మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసే కూటమి కుతంత్రాలను అడ్డుకుందామని కనిగిరి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ అన్నారు.

- 10లో..

గరిష్టం/కనిష్టం
30 /24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన జైళ్ల శాఖ డీఐజీ



కలెక్టర్‌ను కలిసి పూల మొక్క అందజేస్తున్న జైళ్ల శాఖ డీఐజీ వరప్రసాద్

ఒంగోలు సబర్బన్: జైళ్ల శాఖ గుంటూరు డీఐజీ డాక్టర్ ఎం.వర ప్రసాద్ కలెక్టర్ పీ.రాజాబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం ప్రకాశం భవనంలో కలెక్టర్‌ను కలిసిన ఆయన పూల మొక్కను బహూకరించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన జైలుతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఇతర జైళ్లకు సంబంధించిన అంశాలపై మాట్లాడారు.

ఖరీఫ్‌లో ధాన్యం సేకరణకు సన్నద్ధంకండి

● జేసీ గోపాలకృష్ణ



జేసీ ఆర్ గోపాలకృష్ణ

ఒంగోలు వన్‌టౌన్: జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌కు గాను 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామని, ధాన్యం కొనుగోలుకు ఇప్పటి నుంచే అవసరమైన ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్ జాయింట్ కలెక్టర్ జిల్లాలో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల సంసిద్ధతపై సంబంధిత అధికారులతో శుక్రవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో 25 మండలాల్లో 185 రైతు సేవా కేంద్రాల పరిధిలో మొత్తం 45 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం సేకరణకు అవసరమైన రవాణా, హమాలీలు, గోనె సంచులను, తేమ శాతం కొలిచే యంత్రాలను ముందుగా అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో డిసెంబర్ నుంచి వరి ధాన్యం కోతల ప్రారంభమవుతాయని, నవంబరు మాసాంతానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆయన చెప్పారు. ఆర్‌ఎస్‌కేలతో మ్యాపింగ్, రైతుల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని తెలిపారు. పౌర సరఫరాల అధికారులు మిల్లులను ట్యాగ్ చేయడం, బ్యాంకు గ్యారంటీలను తీసుకోవడం, అన్ని మిల్లులు పని చేస్తున్నదీ లేనిదీ తనిఖీ చేయడం, సంబంధిత సిబ్బందికి శిక్షణ పూర్తి చేయడం వంటి కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి పద్మశ్రీ, పౌరసరఫరాల శాఖ డీఎం వరలక్ష్మి, మార్కెటింగ్ ఏడీ వరలక్ష్మి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నియంత పాలనపై నిరసన గళం



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, సాక్షి సిబ్బంది

ప్రభుత్వ వైఫల్యాలను, అక్రమాలను వెలికితీస్తూ ప్రజల పక్షాన నిలబడుతున్న జర్నలిస్టులపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధిస్తోంది. ప్రధానంగా సాక్షి దినపత్రిక లక్ష్యంగా వేధింపులకు దిగుతోంది. పత్రికా రంగంలో ఎన్నడూ లేనివిధంగా పత్రిక సంపాదకులను సైతం నోటీసులు, విచారణల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తోంది. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభంగా ఉన్న పాత్రికేయులపై ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు మానుకోవాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు నిరసన గళమెత్తారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందించారు.

- జర్నలిస్టులపై కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు
- పత్రికా స్వేచ్ఛను హరించడం సరికాదు
- సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిని విచారణల పేరుతో వేధించడం తగదు
- అక్రమ కేసులను ఆపకపోతే ఉద్యమం మరింత ఉధృతం
- నినదించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ప్రజాసంఘాలు
- జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల నిరసనలు

ఒంగోలు సిటీ:

ప్రజల పక్షాన నిలుస్తూ ప్రభుత్వ అక్రమాలను, వైఫల్యాలను ఎండగడుతున్న జర్నలిస్టులపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగుతోందని నిరసన వ్యక్తం చేస్తూ జిల్లా అంతటా విలేకర్లు, జర్నలిస్టు సంఘాలు ఆందోళన చేపట్టాయి. జిల్లా కేంద్రంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు, వివిధ మీడియా ప్రతినిధులు, సాక్షి విలేకర్లు, సిబ్బంది కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, జర్నలిస్టుల హక్కులు పరిరక్షించాలని వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి అలుగుల సురేష్ మాట్లాడుతూ ఎలాంటి వార్తలు రాయాలో పోలీసు వ్యవస్థ నిర్దేశించడం సరికాదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో జర్నలిస్టులు రాయలేరని అన్నారు. పత్రికా వ్యవస్థను కూల్చేసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరించడం దారుణమన్నారు. అధికారంలోకి వచ్చాక సాక్షి పత్రిక, మీడియాలపై కక్ష పూరితంగా చర్యలు తీసుకుంటోందని దుయ్యబట్టారు. అక్రమ కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. జర్నలిస్టులపై నమోదు చేసిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఒక పత్రిక ఎడిటర్‌ను, విలేకర్లను విచారణ పేరుతో రకరకాలుగా ప్రశ్నలతో వేధిస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరుమార్చుకోకపోతే జర్నలిస్టుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ఒంగోలు ప్రెస్ క్లబ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మీసాల శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఖండించారు. ప్రజలకు వాస్తవాలు తెలియకుండా చేసేందుకు జర్నలిస్టులపై కేసులు పెడుతోందన్నారు. ఏడాదిన్నర కాలంగా కూటమి ప్రభుత్వం జర్నలిస్టుల గొంతునొక్కేలా చూడడం సరికాదన్నారు. జర్నలిస్టులు రాయడానికి ప్రయత్నిస్తే వారి ఇళ్లకు వెళ్లి బెదిరించడం, ప్రజల పక్షాన నిలిస్తే తప్పు అన్న విధంగా కేసులు పెట్టడం సరికాదన్నారు. కల్తీమద్యం మీద సాక్షి జర్నలిస్టులు వార్తలు రాస్తే వారి ఇళ్లకు పోలీసులు పోయి నోటీసులు ఇవ్వడం, స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించడం వంటి సంఘటనలతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలను అప్రమత్తం చేసే ప్రయత్నంలో భాగంగా ఒక చిన్న వార్త రాసినందుకు నెల్లూరు బ్యూరో ఇన్‌చార్జ్ మస్తాన్‌రెడ్డిని 60 ప్రశ్నలు అడిగి ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. ఇదేమైనా సీబీఐ కేసా లేదా ఈడీ కేసా అని ప్రశ్నించారు. జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేస్తే వారు వార్తలు రాయకుండా ఉంటారనే ఉద్దేశంతో ఉన్నారని, ఆ పరిస్థితి ఉండదని, ఎవరికీ భయపడే ప్రసక్తే లేదన్నారు. సాక్షి ఎడిటర్ ఆర్ ధనుంజయరెడ్డికి ఇటువంటి పరిస్థితులు సృష్టించడం చాలా దారుణమన్నారు. జర్నలిస్టులను వేధింపులకు గురిచేస్తే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీఆర్‌ఓ ఓబులేసు, డీఎస్పీ శ్రీనివాసరావుకు వినతి పత్రాలు అందజేశారు. ఆందోళనలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు ఇఫ్తార్ బాషా, ఎంసీఏ అధ్యక్షుడు వేల్పూరి నాగేశ్వరరావు, ఎంసీఏ మాజీ అధ్యక్షుడు ఇఫ్తేకర్ బాషా, ఏపీపీజేఏ రాష్ట్ర సభ్యులు ఎం.ప్రసాద్, ఏపీజేఎఫ్ జిల్లా కార్యదర్శి దాసరి సునీల్, ఏపీయూడబ్ల్యూజే మాజీ జాయింట్ సెక్రటరీ బైనబోయిన మాల్యాద్రి, జర్నలిస్టులు, సాక్షి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చేతులకు సంకెళ్లతో వినూత్న ర్యాలీ



వైపాలెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద చేతులకు సంకెళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

యర్రగొండపాలెం: రాష్ట్రంలో నకిలీ మద్యం విచ్చలవిడిగా ప్రబలిపోతుందని, అనేక మంది పేదలు మృత్యువాత పడ్డారని వార్తలు రాసిన సాక్షి జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేయడం, సాక్షి దిన పత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డిని గంటల తరబడి విచారణ పేరుతో వేధించడం తగదని, అక్రమ కేసులను ఎత్తివేయాలని స్థానిక జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక డిప్యూటీ తహసీల్దార్ విజయభాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ముందుగా బస్టాండ్ సెంటర్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి, చేతులకు సంకెళ్లు వేసుకొని పత్రిక స్వేచ్ఛను కాపాడాలని, జర్నలిస్టుల చేతులకు సంకెళ్లు వేస్తామనుకోవడం అవివేక చర్య అని నినదించారు. అక్కడి నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే మాజీ జిల్లా అధ్యక్షుడు షేక్.నూరుద్దీన్, త్రిపురాంతకం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు శేషు, జర్నలిస్టులు సయ్యద్ షాకీర్ హుస్సేన్ (సర్దార్), షేక్.మహబూబ్ బాష, శంకర్ నాయక్, ఎస్.వెంకోబరావు, ఎస్.సూర్యనారాయణబాబు, ఎ.సత్యనారాయణరెడ్డి, పి.అయూబ్ ఖాన్, డి.లాలు, సుభాష్, యు.ఏసోబు, లక్ష్మిరెడ్డి, జి.కోటేష్, ఎ.అనిల్‌కుమార్, ఎ.ఏసుబాబు పాల్గొన్నారు.

సాక్షిపై కేసులు ఎత్తివేయాలి

● ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణ డిమాండ్



మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

మార్కాపురం: ప్రభుత్వం సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డితోపాటు ఇతర పాత్రికేయులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణ కోరారు. శుక్రవారం మార్కాపురం పట్టణంలో పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి సబ్‌కలెక్టర్ వెంకట సహదిత్ త్రివినాగ్‌కు వినపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎస్‌వీ రమణ మాట్లాడుతూ పాలకులకు పత్రికల్లో వచ్చిన వార్తలు నచ్చకపోతే ఖండన ఇవ్వొచ్చని, అలా కాకుండా పాత్రికేయులపై అక్రమ కేసులు నమోదుచేయడం, పత్రికా కార్యాలయాల్లో సోదాలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు జీఎల్ నరసింహారావు, బీ మల్లికార్జునరావు, బీ రామయోగయ్య, పీ నరేంద్ర, శేఖర్, బూదాల సురేష్, అనీల్‌కుమార్, కల్లూరి వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చిన్నబాబు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపులో భాగంగానే సాక్షిపై అక్రమ కేసులు

కొండపి: కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులో భాగంగానే సాక్షి జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేస్తోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి, ఇతర సాక్షి రిపోర్టర్ల పై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ తహసీల్దార్ శీలం శ్రీనివాసరావుకు పలువురు జర్నలిస్టులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను వెలికితీస్తుందన్న భయంతోనే రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగంగానే సాక్షిపై అక్కసు పెంచుకున్నారన్నారు. తమ తప్పులు బయటపడతాయని దురుద్దేశంతో సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి పై, నెల్లూరు జిల్లా రిపోర్టర్లపై అక్రమ కేసులు బనాయించారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకొని పాలనపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు కాకుమాని రాకేష్ వర్మ, చుండి గణేష్, యామవరపు నిరీక్షణ్ కుమార్, వినోద్ ఇతర నాయకులు పాల్గొన్నారు.



కొండపిలో తహసీల్దార్ శీలం శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న మండల కన్వీనర్ కోటేశ్వరరావు, రిపోర్టర్‌లు

సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులు హేయమైన చర్య

గిద్దలూరు రూరల్: సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డితో పాటుగా సాక్షి విలేకరుల పై అక్రమ కేసులు బనాయించడం హేయమైన చర్యగా భావించాలని సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య అన్నారు. జర్నలిస్టులపై అక్రమ కేసులకు నిరసనగా గిద్దలూరులోని జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని సాక్షి కార్యాలయాల పై జరుగుతున్న దాడులు అప్రజాస్వామ్యమన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఎం.రాజ్‌కుమార్, రఫీ, యాకుబ్ ఖాన్, రసూల్, ఖాజా, యల్లా శివ, నెమలిగుండం, గిరి, మూర్తి, శేఖర్, కాకి అంకయ్య, ఆచారి, రమేష్, కాశీ, సీఐటీయూ నాయకులు నరసింహులు, ఆర్ట్ ఆఫ్‌లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకుడు ఖాజా, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.



గిద్దలూరులో పత్రాన్ని అందజేస్తున్న జర్నలిస్టులు

పచ్చ నేతలకు మేతగా నిర్వాసితుల ప్యాకేజీ

- వెలిగొండ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కావాలంటే పైకం ముట్టచెప్పాల్సిందే
- రూ.కోట్లు వసూలుకు స్కెచ్ గీసిన కూటమి నాయకుడు
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజం



ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ను కలిసిన ప్రాజెక్ట్ నిర్వాసితులు

యర్రగొండపాలెం: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ ప్యాకేజీ పచ్చనేతలకు మేతగా మారిందని, అధికారులు, టీడీపీ నాయకులు కలిసి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని అతిపెద్ద స్కాంగా మార్చుకున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. వెలిగొండ ప్రాజెక్ట్ పరిధిలోని పెద్దారవీడు మండలం సుంకేసుల, కలనూతల, గుండంచెర్ల నిర్వాసితులు శుక్రవారం ఆయనతో కలిసి తమకు జరుగుతున్న అన్యాయం గురించి చర్చించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే జేసీ, ఎస్‌డీసీలకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్కొక్క నిర్వాసితుడి నుంచి రూ.20 వేల ప్రకారం మొత్తం రూ.10 కోట్లు వసూళ్లకు సిద్ధమయ్యారని, పైకం ఇచ్చిన వారికే అవార్డు వస్తుందని లేకుంటే ఆ అవార్డును నిలిపేస్తారని టీడీపీ నాయకులు బాహాటంగా నిర్వాసితులను ఆందోళనకు గురిచేస్తూ.. అధికార అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారని, కొంతమంది నిర్వాసితుల నుంచి డబ్బు కూడా వసూలు చేశారని ఆయన అన్నారు. కూటమి దోపిడీకి అద్దంపట్టే ఈ వ్యవహారాన్ని అతిపెద్ద స్కాంగా పరిగణించాలని ఆయన సంబంధిత జిల్లా అధికారులను కోరారు. దాదాపు వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తయినప్పటికీ నిర్వాసితుల నమోదు కార్యక్రమం పెండింగ్‌లో ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని, ఆయా పంచాయతీల్లో మొత్తం నిర్వాసిత కుటుంబాలు 5,126 ఉన్నాయని, వారిలో 3,760 కుటుంబాలకు అవార్డు లభించిందని, మిగిలిన 1,360 కుటుంబాలను పెండింగ్‌లో పెట్టారని ఆయన అన్నారు. నిర్వాసితుల కుటుంబాలను 20 ఏళ్ల క్రితం గజిట్‌లో నమోదు చేసి నేటికీ అవార్డు కాకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని, దీని వెనక అతిపెద్ద కుట్ర దాగిఉందన్న విషయం అందరికీ తెలుసన్నారు. వీరిని ఏదో కారణం చూపించి అప్పటి అధికారులు, టీడీపీ నాయకులు అవార్డు చేయకుండా ఈ వ్యవహారాన్ని అవినీతి అవసరంగా మలుచుకున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అప్పటి కలెక్టర్, ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్, జేసీల దృష్టికి పలు దఫాలుగా తీసుకెళ్లినా పరిష్కరించకపోవడంలో ఉన్న మతలబు ఏమిటో అర్థం కావడం లేదని అన్నారు. పశ్చిమ ప్రాంత అభివృద్ధి కోసం, 4 జిల్లాలకు చెందిన ప్రజలకు తాగు, సాగు నీరు అవసరాలు తీర్చాలన్న సదుద్దేశంతో నిర్వాసితులు తమ ఉనికి, పుట్టిన గడ్డపై ఉన్న బంధాలు సైతం వదులుకున్నారని ఆయన అన్నారు. అటువంటి నిర్వాసితులు ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూడాల్సిన దయనీయ పరిస్థితి నెలకొందని, వారిపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అవినీతి దాహాన్ని తీర్చుకోవటానికి సిద్ధం అయ్యాడని ఆయన విమర్శించారు.


రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఆరుగురు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ వెంకటేశ్వర్లు, వెంకటరావు

టంగుటూరు: అండర్ 19 బాల బాలికల టెన్నికాయిట్ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు మండలంలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వాక వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం సింగరాయకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఎంపిక పోటీల్లో బాలుర విభాగంలో ఆర్ కార్తికేయ, వెంకట నాగ ఫణీంద్ర, ఏ.గోపీచంద్, బాలికల విభాగంలో వి.భవ్యశ్రీ,, పి.జాహ్నవి, బి.జేసిన్మాయి ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల పీడీ పి.వెంకట్రావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

అండర్ 14, 17 జిల్లా హాకీ జట్ల ఎంపిక



జిల్లా స్థాయి హాకీ ఎంపికలు ప్రారంభిస్తున్న డీఈవో ఏ.కిరణ్ కుమార్

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అండర్ 14, 17 బాలబాలికల జిల్లా హాకీ జట్ల ఎంపిక నిర్వహించారు. ఈ ఎంపికను డీఈవో ఏ.కిరణ్ కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో వివిధ జిల్లాల్లో జరగబోయే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లలో పాల్గొంటారని జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ చెక్కా వెంకటేశ్వర్లు, ఏ.శిరీష తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు డి.శ్రీనివాసరావు, తిరుమలశెట్టి రవికుమార్, ఎంఈఓ వెంకారెడ్డి, హెచ్‌ఎంలు డీవీఎల్ నరసింహారావు, ఆళ్ల వెంకటేశ్వర్లు, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, ఎస్జీఎఫ్ సెక్రటరీస్ వెంకటేశ్వర్లు, శిరీష, హనుమాన్ చారి, డైట్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామిక రంగంలోనూ అభివృద్ధి చెందాలి

● జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసరావు

ఒంగోలు సబర్బన్: మహిళలు పారిశ్రామిక రంగంలోనూ అభివృద్ధి చెందాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బి.శ్రీనివాస రావు పిలుపునిచ్చారు. స్థానిక పాత గుంటూరు రోడ్డులోని జనశిక్షణ సంస్థ(జేఎస్ఎస్) కార్యాలయంలో శుక్రవారం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ శివ సాయి ఐటీఐలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశామన్నారు. మహిళలు తాము శిక్షణ పొందిన రంగాల్లో పరిశ్రమలను స్థాపించాలని ఆయన ఆకాంక్షించారు. సూక్ష్మ, మధ్యతరహా, భారీ పరిశ్రమలకు సబ్సిడీ ద్వారా వివిధ రకాలైన రుణాలను పీఎంఈజీపీ అందజేస్తుందన్నారు. దీనిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శివసాయి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కే.శ్రీనివాసరావు, జనశిక్షణ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ శ్యామ్ సునీల్, మరో ప్రోగ్రాం ఆఫీసర్ హరికృష్ణ, సంస్థ సిబ్బంది శివకృష్ణ, దుర్గాప్రసాద్‌తో పాటు శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న జిల్లా పరిశ్రమల శాఖ జీఎం బి.శ్రీనివాసరావు

క్లుప్తంగా

ప్రభుత్వ న్యాయవాదిగా శ్రీకాంత్


శ్రీకాంత్

ఒంగోలు: ప్రభుత్వ న్యాయవాదిగా జి.శ్రీకాంత్ నియమితులయ్యారు. ఆ మేరకు లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్ ప్రభుత్వ కార్యదర్శి గొట్టపు ప్రతిభాదేవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పర్చూరు మండలం దేవరపల్లికి చెందిన శ్రీకాంత్.. న్యాయవాద విద్య పూర్తిచేసి ఒంగోలులో 1997లో ప్రాక్టీస్ ప్రారంభించారు. గతంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, రెండుసార్లు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా పనిచేశారు. తాజాగా ప్రభుత్వ న్యాయవాదిగా జిల్లా కోర్టులో విధులు నిర్వహించేందుకు ఆయన నియమితులయ్యారు. మూడు సంవత్సరాల పాటు ఈ బాధ్యతలు నిర్వహించనున్నారు.

మార్కాపురం పట్టణంలో బైకులు చోరీ

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో రెండు బైకులు చోరీ అయిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక విద్యానగర్‌కు చెందిన తిరుమలరెడ్డి రామాంజనేయరెడ్డి గురువారం రాత్రి తన ఇంటిముందు బైకును పార్క్ చేసి మరుసటిరోజు ఉదయం చూసుకునేసరికి కనిపించలేదు. అలాగే పట్టణంలోని పదో వార్డు జగదీశ్వరి థియేటర్ ప్రాంతంలో పఠాన్ ఉమర్‌ఖాన్‌కు చెందిన బైకు కూడా ముందు రోజు ఇంటిముందు పార్క్ చేసి శుక్రవారం నిద్రలేచి చూసేసరికి కనపించలేదు. దీంతో బైకుల యజమానులు ఇద్దరు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీ అయిన బైకుల విలువ సుమారు రూ.1.70 లక్షలు కాగా, కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు.

14 మంది జూదరులు అరెస్ట్

- రూ.1,09,910 నగదు స్వాధీనం

పెద్దారవీడు: మండల పరిధిలోని రేగుమానిపల్లి గ్రామం సమీపంలో పేకాట శిబిరంపై పెద్దారవీడు, పెద్దదోర్నాల ఎస్సైలు వి.సాంబశియ్య, వి.మహేష్ సంయుక్తంగా తమ సిబ్బందితో కలిసి శుక్రవారం దాడి చేశారు. ఈ సందర్భంగా పెద్దారవీడు ఎస్సై మాట్లాడుతూ.. పేకాట స్థావరంలో కోతముక్క ఆడుతున్న 14 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద రూ.1,09,910 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను మార్కాపురం ఏజేఎఫ్‌సీ కోర్టు మేజిస్ట్రేట్ ఎం.బాలాజీ ఎదుట హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ 300 జరిమానాతోపాటు 2 రోజుల సాధారణ జైలు శిక్ష విధించారని వివరించారు.

గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద వేతనమివ్వాలి

ఒంగోలు సిటీ: గ్రంథాలయ ఉద్యోగులకు 010 కింద వేతనం చెల్లించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఒంగోలు గ్రంథాలయ కార్యాలయంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ×టీ తాగుతూ మాట్లాడుకుందాం ₹ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను


మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి, సంఘ నాయకులు

ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఒంగోలు టౌన్ అధ్యక్షుడు మోటా శ్రీనివాసరావు, డాక్టర్ మానస, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జీవీ శివారెడ్డి, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.భాస్కర రావు, జిల్లా మహిళా కన్వీనర్ డి.ధనమ్మ, గ్రంథాలయ సంస్థ పెన్షనర్ వింగ్ అధ్యక్షుడు డీవీ సుబ్బారెడ్డి, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులు ఏకమవ్వాలి


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: రైల్వే ఉద్యోగులంతా అంబేడ్కర్ ఆలోచనా విధానంతో ఐక్య పోరాటాలు చేయాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ జోనల్ సెక్రటరీ దాశరథి కృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో కృష్ణ పాల్గొని ప్రసంగించారు. అంబేడ్కర్ ఒక నాయకుడు మాత్రమే కాదని, విశ్వమానవుడని, శ్రామికుల వేతనం కోసం, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం రాజ్యాంగంలో హక్కులు కల్పించారని చెప్పారు. అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం రైల్వేలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు పోరాటాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ ప్రెసిడెంట్ అంగడి వినోద్, సాయిబాబా, గూటలా పాపారావు, బీవీ నాయక్, విజయరాజు, గంగపట్నం శ్యామ్ సుందర్ నాయక్, దాసరి శ్రీకాంత్, చింతా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పశువులంటేే ప్రాణం.. బీమా ఇవ్వం!

'తమ్ముళ్లూ.. ఇన్నాళ్లు మీరు విద్యార్థులు, యువత, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు చూసి ఉంటారు. ఇకపై మీ గ్రామాల్లోనే పశువుల హాస్టళ్లు చూస్తారు. పశువులన్నీ ఒకేచోట ఉండేలా హాస్టల్ పెడతాం. వాటిని అప్పడప్పుడూ వెళ్లి యజమానులు చూసుకోవచ్చు" ఇవీ ఇటీవల ఓ సభలో సీఎం నారా చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలు.. ఇవి విన్న జనమంతా పశువులకు హాస్టళ్లేంటో అని జుట్టు పీక్కున్న పరిస్థితి. పశువులంటే తనకు అంత ప్రాణమని సీఎం చంద్రబాబు తన వ్యాఖ్యల ద్వారా వెల్లడించినప్పటికీ అవి ప్రమాదాల్లో మృతి చెందితే బీమా వర్తింపజేస్తామని మాత్రం ఎక్కడా చెప్పలేదు. పైగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన పశు బీమా పథకానికి సైతం బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా తూట్లు పొడవడంపై పాడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


మేతకు వెళ్తున్న గొర్రెలు, మేకలు

- పశు బీమా పథకానికి కూటమి సర్కారు సమాధి
- బడ్జెట్‌లో అరకొర నిధులతో కొన్ని పశువులకే బీమా
- మొత్తం ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోండని అధికారుల సూచన
- భారం మోయలేక బీమా పథకానికి దూరంగా ఉన్న రైతులు

బేస్తవారిపేట:

ఊహించని విపత్తులు, కరువు కాటకాలు, రోడ్డు, రైలు, అగ్ని ప్రమాదాలు, విద్యుదాఘాతాలు, పిడుగుపాటుతో పశువులు మృత్యువాత పడితే, వాటిని చంటి బిడ్డల్లా సంరక్షించే యజమానులు అనుభవించే బాధ వర్ణణాతీతం. పాడి పైనే ఆధారపడి కుటుంబాలను పోషించుకునే వారు పశువుల మరణాన్ని జీర్ణించుకోలేరు. మృత్యువాత పడిన పశువులకు బీమా లేకపోతే ఆ రైతులు ఆర్థికంగా చితికిపోవాల్సిందే. ఈ నేపథ్యంలో రైతుల సమస్యపై సహృదయంతో స్పందించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నేరుగా పశు బీమా పథకాన్ని అమలు చేసింది. 2019కు ముందు వరకు పశు బీమా పథకాన్ని ప్రైవేట్ ఏజెన్సీల ఆధ్వర్యంలోనే నిర్వహించగా ఆ విధానానికి అప్పటి సీఎం వైఎస్ జగన్ స్వస్తి పలికారు. 2019 నుంచి 2022 వరకు మూడేళ్లపాటు ప్రమాదాల్లో మృతి చెందిన పశువులకు వైఎస్సార్ పశు నష్ట పరిహారం అందించారు. 2022లో ప్రభుత్వ పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టి పాడి రైతులకు మరింత మేలు చేసేందుకు చర్యలు చేపట్టారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పశు బీమా పథకాన్ని పాడి రైతులకు దూరం చేసేలా నిబంధనలను సవరించింది. బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా పథకాన్ని గాలికొదిలేసింది. పాడి రైతులపై అధిక ప్రీమియం భారాన్ని మోపడంతో బీమా చేయించుకునేందుకు రైతులు ముందుకు రాని పరిస్థితి. ఈ క్రమంలో పశువులు మృత్యువాత పడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

జిల్లాలో తెల్ల పశువులు 56,332, నల్ల పశువులు 6,71,812, గొర్రెలు 15,67,122, మేకలు 4,17,589 ఉన్నాయి. గత ప్రభుత్వంలో పశుసంవర్థకశాఖ అధికారులు పాడిరైతుల వద్దకు వెళ్లి బీమా పథకంపై అవగాహన కల్పించి, నమోదు చేయించేవారు. ఇందుకు గాను ప్రభుత్వం పశు సంవర్థక శాఖ సిబ్బందికి ప్రోత్సాహక నగదు కూడా అంజేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గత ఏడాది బడ్జెట్‌లో విడుదల చేసిన అరకొర నిధులతో ఈ ఏడాది జనవరిలో మొక్కుబడిగా పథకాన్ని ప్రారంభించింది. కొన్ని పశువులకు మాత్రమే బీమా చేసి చేతులు దులుపుకొంది. ఉదాహరణకు బేస్తవారిపేట మండలానికి 100 పశువులకు సరిపడా బడ్జెట్ కేటాయించారు. దీంతో ఒక్కో పశువైద్యశాల పరిధిలో 25 పశువులకు మాత్రమే బీమా చేయాల్సి వచ్చింది. మరి మిగిలిన పశువుల సంగతేమిటో పాలకులే సెలవివ్వాలి.

అడ్డగోలుగా నిబంధనలు

వివిధ ఘటనల్లో పశువులు, సన్నజీవాలను కోల్పోతున్న వారిని ఆదుకోవడానికి 2019కు ముందు ప్రభుత్వ పరంగా ఎలాంటి బీమా పథకం లేదు. ప్రైవేట్ బీమా పథకాలు చేయించుకున్నవారికి సైతం సదరు కంపెనీలు తమ చుట్టూ రెండేళ్లపాటు తిప్పుకొని అరకొరగా బీమా నిధులు జమచేసిన పరిస్థితి. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పశుపోషకులకు ఎలాంటి ఇబ్బందులు కలగజేయకుండా పశువుల బీమాకు శ్రీకారం చుట్టింది. కానీ ఏడాదిన్నర క్రితం గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం పశువుల బీమా పథకంలో అడ్డగోలు నిబంధనలు చొప్పించి పాడి రైతుల ఆశలపై దారుణంగా దెబ్బ కొట్టింది. ఉత్పాదక దశలో ఉన్న 2–10 ఏళ్ల వయసులోపు ఆవులు, 3–12 ఏళ్ల వయసు గేదెలకు, అలాగే ఏడాదిన్నర వయసున్న మేలు జాతి ఎద్దులు, దున్నలు, రెండేళ్లు పైబడిన ఎద్దులు, దున్నలు, నాటు ఆవులు, ఆరు నెలల పైబడిన మేకలు, గొర్రెలకు మాత్రమే బీమా వర్తిస్తుందని నిబంధనలు విధించింది. యజమాని ఉద్దేశపూర్వకంగా హాని తలపెట్టినా, ప్రైవేట్ ఏజెన్సీల్లో బీమా చేయించినా పథకం వర్తించదని చెప్పిన ప్రభుత్వం రాష్ట్ర, జాతీయ విపత్తుల ప్రతిస్పందన నిధి పరిధిలోకి వచ్చే ప్రమాదాలకు బీమా సొమ్ము చెల్లించబోమని మెలికపెట్టింది. పదేళ్ల వయసు దాటిన ఎద్దులు, దున్నలకు, ఆరు నెలల్లోపు వయసు గొర్రెలు, మేకలకు, శాశ్వత అంగవైకల్యం కలిగిన పశువులకు బీమా వర్తించదని నిబంధన విధించడంతో పాడి రైతులు డీలా పడిపోయారు.

కూటమి ప్రభుత్వంలో ఇలా.. ఒక్కో పశువుకు బీపీఎల్, ఎస్సీ, ఎస్టీలు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలు

బీమా మొత్తం	ప్రీమియం	ప్రభుత్వ వాటా	రైతు వాటా
15 వేలు	960	768	192
30 వేలు	1920	1536	384
గొర్రెలు, మేలకు	375	300	75
(రూ6 వేలకు)			


బేస్తవారిపేట హైవే పక్కన ప్రమాదవశాత్తు మృతి చెందిన గేదె

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మెరుగ్గా..

వైఎస్సార్ పశు బీమా పథకం కింద చెల్లించే మొత్తం ప్రీమియంలో 80 శాతాన్ని ప్రభుత్వమే భరించేది. 20 శాతం మాత్రమే పశుపోషకులు చెల్లించేవారు. దేశీ ఆవులు, గేదెలు ఒక్కో దానికి ప్రభుత్వం రూ.924 ప్రీమియం భరించగా, పశుపోషకులు రూ.231, అలాగే ఎద్దులు, దున్నపోతులకు ప్రభుత్వం ఒక్కో దానికి రూ.185 భరించగా లబ్ధిదారులు రూ.116, గొర్రెలు, మేకలకు ఒక్కోదానికి ప్రభుత్వం రూ.185 భరించగా లబ్ధిదారులు రూ.46 చెల్లంచేవారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్క జీవం చనిపోయినా బీమా వర్తింపజేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతో పోలిస్తే కూటమి ప్రభుత్వంలో పశువుల బీమా ప్రీమియంను రెట్టింపు చేశారు.

పశువుల బీమాకు నిధులు కేటాయించాలి

రాష్ట్ర ప్రభుత్వం పశువుల బీమాకు నిధులు కేటాయించాలి. ఒక్కో గేదె రూ.70 వేల నుంచి రూ.లక్ష ధర ఉంటుంది. దురదృష్టవశాత్తు కుటుంబానికి ఆధారమైన గేదె మరణిస్తే తీవ్ర నష్టం జరుగుతుంది. పశు బీమా కోరిన ప్రతి పాడిరైతుకు అవకాశం కల్పించాలి. అరకొరగా కేటాయింపులు చేయడం వల్ల రైతులకు ఎటువంటి ఉపయోగం ఉండదు.

– చేగిరెడ్డి అంకిరెడ్డి, పిటికాయగుళ్ల

పూర్తి నగదు చెల్లించాలంటే ఎలా?



ప్రభుత్వం పశు బీమా పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి. పశుబీమా కోసం పశువైద్య సిబ్బందిని సంప్రదిస్తే ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదంటున్నారు. ప్రభుత్వం నిధులు కేటాయించినప్పుడు బీమాకు సబ్సిడీ ఉంటుందని, ఇప్పుడు పూర్తి నగదు చెల్లించి బీమా చేయించుకోవాలని చెబుతున్నారు.

– దప్పిలి కాశిరెడ్డి, జేసీ అగ్రహారం

హాస్టళ్ల తర్వాత బీమా ఇవ్వండి



ప్రమాదవశాత్తు పశువులు మరణిస్తే ప్రస్తుతం బీమా వర్తించే పరిస్థితి లేదు. ఈ ఏడాది నిధులు కేటాయించలేదని బీమా చేయడం లేదు. ప్రభుత్వం పశు బీమాకు నిధులు కేటాయించాలి. కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకునే పరిస్థితి ఎక్కడా కనిపించడంలేదు. పశువులకు హాస్టళ్లు ఏర్పాటు చేస్తామంటున్నారు. అది తర్వాత చూడొచ్చు. పశువులకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే బాగుంటుంది.

– మల్లెల శేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం కన్వీనర్

కూటమి కుతంత్రాలను అడ్డుకుందాం

- బినామీల కోసం మెడికల్ కాలేజీల పీపీపీ కుట్ర
- పేద వైద్య విద్యార్థులకు చంద్రబాబు వంచన
- వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ ధ్వజం


కోటి సంతకాలను ప్రారంభిస్తున్న దద్దాల నారాయణ యాదవ్, తిరుపతిరెడ్డి, పార్టీ నేతలు

వెలిగండ్ల (కనిగిరిరూరల్): ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసి పేద వర్గాలకు వైద్యం, విద్యను అందకుండా చేయాలన్న సీఎం చంద్రబాబు నాయుడు కుట్ర, కుతంత్రాలను అడ్డుకుందామని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా వెలిగండ్ల మండలంలోని వెలిగండ్ల, మోటుపల్లి గ్రామాల్లో జెడ్పీటీసీ, జిల్లా ఉపాధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కేంద్రం సహకారంతో ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల స్థాపనకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. రాజ్యాంగం ప్రకారం ప్రజలకు విద్య, వైద్యం అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అన్నారు. సంపద సృష్టిస్తానంటూ అన్నీ ప్రైవేటీకరించేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు రూ.25 లక్షల విలువైన చికిత్స కార్పొరేట్ ఆస్పత్రుల ద్వారా అందేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని పూర్తిగా భ్రష్టుపట్టించార్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు అనేక సంక్షేమ పథకాలను అటకెక్కించేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇసుక, మద్యం ఇలా అన్ని మార్గాల ద్వారా దోపిడీయే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. కోటి సంతకాల ప్రజా ఉద్యమం ద్వారా చంద్రబాబు చేపట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలకు, పార్టీ శ్రేణులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతి రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి, పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి కటికల వెంకటరత్నం, పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు ఎలికా నారాయణ, పల్నాటి భాస్కర్ రెడ్డి, గూడూరి అనిల్ బాబు, కాకర్ల వెంకటేశ్వర్లు, ముక్కు వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ సయ్యద్ హమీద్, గాలి తిరుపతిరెడ్డి, సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు, తాతపూడి నాని, అయినకోట రంగయ్య, గోనజేమ్స్, తమ్మనేని శివరామిరెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి, చిలకల నారాయణరెడ్డి, గంజి పరమేశ్వర్ రెడ్డి, బొబ్బ వెంకటరెడ్డి, ముత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కేలం శేఖర్ రెడ్డి, పాపాబత్తుని నాగేశ్వరరావు, నంబుల అడివయ్య, గిద్ద బ్రహ్మయ్య, డోకుపర్తి సిద్దు, రాయల బ్రహ్మం, సంగటి బాబు, కటుకూరి చిన పేరయ్య, షేక్ కమల్ వలి, సోము బాలచౌడా రెడ్డి, గాలి వెంకటేశ్వర్ రెడ్డి, సర్పు రమణయ్య, మల్లెబోయిన తిరుపతయ్య, ఎరజాల విష్ణు, కొల్లెబోయిన గురువయ్య, నాగం గురవయ్య, గంజి రవీంద్రారెడ్డి, రాయలఅంజి, వేల్పుల హరినారాయణ, ఎగిటి ఐతం రాజు, దండు జయరామిరెడ్డి, శ్యామల ప్రసాద్ రెడ్డి, పేరంరెడ్డి జయరామిరెడ్డి, ముక్కు పెద్దిరెడ్డి, కుమ్మరికుంట నెహెమియా, కొనతం కేశవరెడ్డి, గురవయ్య, మితికల నారాయణ, వేల్పుల తిరుపతయ్య, కుమ్మరి కుంట రోశయ్య, శెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కిల్కారి సేవలను ఉపయోగించుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి వెంకటేశ్వర్లు

ఒంగోలు సిటీ: కిల్కారి సేవలను గర్భిణులు, బాలింతలు ఉపయోగించుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. ఒంగోలులో జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో శుక్రవారం ఆశ నోడల్ ఆఫీసర్లకు జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. కిల్కారి సేవలతో పాటు ఆడపిల్లను పుట్టనిద్దాం – ఆడపిల్లని చదివిద్దాం అనే అంశంపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కిల్కారి కాల్ వచ్చినపుడు ప్రతి సమాచారాన్ని పూర్తిగా గర్భిణులు, బాలింతలు వినేలా చూడాలన్నారు. తద్వారా ప్రతి గర్భిణీ, బాలింతకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కిల్కారి ప్రోగ్రాం ప్రవేశపెట్టిందన్నారు. మాతాశిశు మరణాలు తగ్గించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గర్భిణికి నాలుగో నెల మొదలుకుని పుట్టిన బిడ్డకు ఏడాది నిండేంత వరకు వారానికి ఒకసారి రెండు నిమిషాల్లోపు నిడివి గల కిల్కారి కాల్స్ వస్తాయని, తల్లీబిడ్డల ఆరోగ్య క్షేమ సమాచారం తెలియజేస్తాయని తెలిపారు. దీనిపై ఆశ నోడల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు పీహెచ్‌సీల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కమలశ్రీ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి దాసరి శ్రీనివాసులు, ఆరోగ్య విద్య విస్తరణ అధికారి రాజేశ్వరి, డీసీఎం, కిల్కారి రీజినల్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాజు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ
కూటమి సర్కారు కుట్ర


సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేట్టిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

- వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శ
- ప్రైవేటీకరణకు నిరసనగా చర్లోపల్లిలో కోటి సంతకాల సేకరణ

పెద్దదోర్నాల: వైఎస్ జగన్ హయాంలో చేసిన అభివృద్ధిని కప్పెట్టడంతోపాటు తన అనుచరులకు లబ్ధి చేకూర్చే ఉద్దేశంతోనే సీఎం చంద్రబాబు పీపీపీ విధానాన్ని తెరపైకి తెచ్చారని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని, గత టీడీపీ ప్రభుత్వ జమానాల్లో షుగర్ ఫ్యాక్టరీలు, నూలు మిల్లులను అడ్డగోలుగా అమ్మేశారని దుయ్యబట్టారు. శుక్రవారం పెద్దదోర్నాల మండల పరిధిలోని ఎగువ చర్లోపల్లి, పెద్ద బొమ్మలాపురం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తాటిపర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో శంకుస్థాపన చేసిన మెడికల్ కాలేజీల్లో 7 ప్రారంభం కాగా 10 కాలేజీలు దాదాపు 80 శాతం పూర్తయ్యాయని తెలిపారు. జగనన్న చేసిన అభివృద్ధిని చూడలేక ఆయన చేపట్టిన ప్రాజెక్టులను ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. మెడికల్ కాలేజీల విషయంలో ప్రభుత్వం కళ్లు తెరిచేలా చేయడమే కోటి సంతకాల కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు. కార్యక్రమంలో నాయకులు చిట్టె వెంకటేశ్వరరెడ్డి, గుమ్మా యల్లేష్, అల్లు రాం భూపాల్‌రెడ్డి, వల్లభనేని పవన్‌కుమార్, మొద్దు తిరుపతిరావు త్రిపురాంతకం నాయకులు ఆళ్ల కృష్ణారెడ్డి, సింగా ప్రసాద్, యర్రగొండపాలెం సర్పంచ్ అరుణాబాయి, అల్లు రాంకోటిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ రాజాబాబు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు వన్‌టౌన్: మండల అభివృద్ధి అధికారులు వారి ప్రధాన కర్తవ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.రాజాబాబు హెచ్చరించారు. ఎస్సీ ప్రజలు మెజార్టీగా ఉండే గ్రామాల్లో ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎం – ఏజేఏవై) అమలుపై శుక్రవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందడమంటే జిల్లా అభివృద్ధి చెందడమేనన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.లక్ష్మానాయక్ మాట్లాడుతూ పీఎం – ఏజేఏవై కింద గ్రామ స్థాయిలో విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, సామాజిక భద్రత, గ్రామీణ రోడ్లు, ఇళ్ల నిర్మాణం, విద్యుత్, మెరుగైన వ్యవసాయ విధానాలు, ఆర్థిక సమ్మిళితం, డిజిటలైజేషన్, నైపుణ్యాభివృద్ధి పెంపు, జీవనోపాధి కల్పన వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం సర్పంచ్ అధ్యక్షతన ఏర్పడే కమిటీలో గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తారని తెలిపారు. ఈ విధంగా గుర్తించిన పనులను కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో చేపడతారన్నారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నిధులు మంజూరు చేసిందని, పనులను కూడా గుర్తించినప్పటికీ వాటిని చేపట్టడంలో జాప్యం జరుగుతోందని ఆయన తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఎంపీడీవోలు అంటేనే మండల స్థాయిలో అభివృద్ధి పనుల పర్యవేక్షణ అధికారులని, మీ ప్రధాన విధిపై దృష్టి సారించకుండా ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. పథకాలను పర్యవేక్షిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మొక్కుబడిగా పనిచేస్తామంటే కుదరదని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, డీఈవో కిరణ్ కుమార్, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.